క్లుప్తంగా

సెంట్రలైజ్‌డ్ కిచెన్ విధానం విరమించుకోవాలి



మాట్లాడుతున్న మీసం లక్ష్మణ్‌యాదవ్

సిరిసిల్ల అర్బన్: సెంట్రలైజ్‌డ్ కిచెన్ విధానాన్ని ప్రభుత్వం విరమించుకొని, కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్‌యాదవ్ కోరారు. కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారం రెండో రోజుకు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 54,200 మంది వంట కార్మికులు పనిచేస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. నాయకులు రాములు, అజయ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం



కొలనూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోనరావుపేట: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని మండల వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కోనరావుపేట, మల్కపేట, కొలనూరు గ్రామాల్లో గురువారం డ్రై డే, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులపై శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్నవారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బోయినపల్లి: మండలంలోని మాన్వాడలో కొదురుపాక పీహెచ్‌సీ వైద్యాధికారిణి రేణుక ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 66 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వినూత్న, పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ, ఏఎన్‌ఎంలు వినోద, లక్ష్మి తదితరులున్నారు.

హామీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన పింఛన్ల హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో గురువారం మహిళలతో ఆయన సమావేశమై మాట్లాడారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులకు ప్రభుత్వం పింఛన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అందే శామ్యూల్, వృద్ధులు, వికలాంగులు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఈటీసీఏ సాయం



నాగరాజుకు ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న సంఘం నాయకుడు

బోయినపల్లి: గల్ఫ్‌లో అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బంది పడుతున్న జిల్లాకు చెందిన ఒకరికి, జగిత్యాల జిల్లాకు చెందిన మరొకరికి గురువారం ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం (ఈటీసీఏ) సాయం అందించి అండగా నిలిచింది. బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన ఎదురుగట్ల నాగరాజు (41) ఉపాధికోసం దుబాయ్ వెళ్లి అక్కడ ప్రైవేట్ కంపెనీలో పదేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. నెల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడి వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్‌గా నిర్ధారించి సర్జరీ చేశారు. విషయాన్ని రత్నంపేటకు చెందిన కొడగాని సత్యనారాయణ తన మిత్రుడైన ఏటికె ఫౌండర్ పీచర కిరణ్ కుమార్‌కు చెప్పారు. స్పందించిన ఈటీసీఏ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాజేశ్ పోలంపల్లి, కార్తీక్ రెడ్డి వెంటనే ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. నాగరాజుకు పక్షవాతం రావడంతో వైద్యుడి పర్యవేక్షణలో కంపెనీ వారు స్వగ్రామం పంపారు. ఈ క్రమంలో నాగరాజు వైద్యఖర్చుల కోసం సంఘ సభ్యుల విరాళాలతో రూ.50 వేల చెక్కును ఇండియా వచ్చిన ఈటీసీఏ అధ్యక్షుడు చీటి జగదీశ్‌రావు, సలహాదారు సురేశ్‌రెడ్డి కరీంనగర్‌లో నాగరాజు చికిత్స పొందుతున్న ఆస్పత్రిలో ఆయన భార్య రేణుకకు అందజేశారు. రోడ్డు ప్రమాదంలో ఎడుమ కాలు కోల్పోయి, విమాన టికెట్ కోసం ఈటీసీఏను ఆశ్రయించిన జగిత్యాల జిల్లా పెగడపెల్లి మండలం దేవికొండకు చెందిన మామిడి రాజుకు విమాన టికెట్‌కు రూ.24వేలు ఈటీసీఏ విరాళాలతో సాయం అందించిందని తెలిపారు.

వైద్యం ధైన్యం

- ముస్తాబాద్ కార్మిక సంచార ఆస్పత్రికి సుస్తీ
- ఫార్మసిస్ట్ కరువు
- బీడీ కార్మికులకు అందని వైద్యం
- ఐదేళ్లుగా లేని మొబైల్ వాహనం
- గ్రామాల్లో వైద్య శిబిరాలు కరువు



ముస్తాబాద్‌లోని కేంద్ర కార్మిక ఆస్పత్రి

ముస్తాబాద్: కేంద్ర ప్రభుత్వ సంచార బీడీ కార్మిక ఆస్పత్రికి సుస్తీ చేసింది. వేలాదిమంది మహిళా బీడీ కార్మికులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఏళ్లుగా ఖాళీ ఉన్న పోస్టులతో కార్మికులకు సరైన వైద్యం అందడం లేదన్న విమర్శలున్నాయి. పేరుకే కార్మిక ఆస్పత్రిగా కొనసాగుతున్నా కార్మికులకు వైద్యం అంతంతే మాత్రమేనన్న ఆరోపణలున్నాయి. ముస్తాబాద్‌లో కేంద్ర కార్మిక సంచార వైద్యశాల బీడీ కార్మికులకు దూరంగా కొనసాగుతోంది.

పేరుకే ఆస్పత్రి

మండలకేంద్రంలోని కేంద్ర కార్మిక ఆస్పత్రిలో పదేళ్ల క్రితం వాహనం అందుబాటులో ఉండేది. అది రిపేరుకు రావడంతో దాని స్థానంలో కొత్త వాహనం కొనుగోలు చేయలేదు. ముస్తాబాద్‌లో అద్దె భవనంలో కార్మిక ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. శాశ్వత భవనం నిర్మించి వసతులు కల్పించాలన్న కార్మికుల డిమాండ్ నేరవేరడం లేదు. ఇక్కడ కేవలం వార్డు బాయ్ మాత్రమే నిత్యం అందుబాటులో ఉంటుండగా వైద్యాధికారి, ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక వైద్యాధికారి కూడా అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటారు.

బీడీలు చుట్టి.. అస్వస్థతకు గురవుతూ

ముస్తాబాద్‌లో ఇరవై ఏళ్ల క్రితం నెలకొల్పిన కేంద్ర కార్మిక సంక్షేమ ఆస్పత్రిలో మూడు మండలాలకు చెందిన కార్మికులకు వైద్యం అందిస్తున్నారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాలకు చెందిన బీడీ మహిళా కార్మికులతోపాటు, సినిమా కార్మికులు, ఇటుక బట్టీల కార్మికులకు వైద్యం అందించాల్సి ఉంది. మూడు మండలాల పరిధిలో 40 వేల మంది కార్మికులున్నారు. వీరందరికీ ఆయాగ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్స అందించాలి. పొద్దంతా బీడీలు చుట్టి, తంబాకు, ఆకుతో ఇబ్బంది పడే కార్మికులు వివిధ వ్యాధులబారిన పడుతున్నారు. ముఖ్యంగా ఒళ్లనొప్పులు, శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నారు. వీరికి మందులు అందించే వారు కరవయ్యారు.

దుబ్బాక వైద్యాధికారికి అదనపు బాధ్యతలు

ముస్తాబాద్ వైద్యాధికారి విక్రమ్ ఇటీవలే బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లా దుబ్బాక ఆస్పత్రి వైద్యాధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన సోమ, లేదా మంగళవారాల్లో ఏదో ఒకరోజు ముస్తాబాద్‌కు వస్తున్నారు. పేషెంట్లు ఎవరైనా వస్తున్నారని సమాచారం ఇస్తేనే వచ్చి వెళ్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు.

కనీస సేవలు కరువు



బీడీలు చేసే మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలి. పదేళ్లుగా ఇక్కడ కనీస సేవలు కరువయ్యాయి. ఆస్పత్రిలో కేవలం అటెండర్ మాత్రమే ఉంటున్నారు. సరైన మందులు ఇవ్వడం లేదు. కార్మిక మహిళలకు వైద్యం అందించేవారు లేరు. వైద్యాధికారిని నియమించాలి.

– దుబ్బాక స్వేచ్ఛ, ముస్తాబాద్

శాశ్వత భవనం నిర్మించాలి



మూడు మండలాల కార్మికుల కోసం ఉన్న ఆస్పత్రి శాశ్వత భవనం నిర్మించి, వైద్యులు, సిబ్బందిని నియమించాలి. మొబైల్ వాహనం ఏర్పాటు చేసి శిబిరాలు నిర్వహించాలి. కార్మికులకు అన్ని వసతులు కల్పించాలి. 40వేల మంది కార్మికులకు వైద్యం అందించే ఆస్పత్రిని బాగుచేయాలి.

– బద్దెపూరి శ్రీనివాస్, కార్మిక నాయకుడు

వైద్యం అందిస్తున్నాం

“ బీడీకార్మిక ఆస్పత్రిలో ఉన్నంతలో కార్మికులకు మెరుగైన వైద్యాన్ని కార్మికులకు అందిస్తున్నాం. అందరికీ అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. మందుల కొరత లేదు. ఇన్‌చార్జి వైద్యాధికారి పనిచేస్తున్నారు. కార్మికులందరికీ ఎలాంటి సాయమైన అందించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం. ”

– మధు, ఫార్మసిస్ట్

బీసీ బిల్లుపై రెండు నాల్కల ధోరణి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాజకీయ లబ్ధికోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చీకట్లో దోస్తీ చేస్తూ బయటకు ప్రత్యర్థుల్లా ఉంటారని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్లలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అన్నివిధాలా ప్రగతి సాధిస్తుందన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రవేశ పెట్టగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీ ఎమ్మెల్యేలు సైతం అనుకూలంగా మద్దతిచ్చారన్నారు. బీసీల అభ్యున్నతిపై చిత్తశుద్ధిలేని బీజేపీ పార్టీ పాలిత రాష్ట్రాల్లో కూడా బీసీ బిల్లును అమలు చేయాల్సి వస్తుందన్న కుట్రతోనే తెలంగాణలో బీసీ బిల్లును వ్యతిరేకిస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధికోసమే బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండునాల్కల ధోరణిని అవలంభిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై ప్రజలకు స్పష్టమైన బదులివ్వాలని సూచించారు. కేంద్ర మంత్రి బండిసంజయ్, ఎంపీ అరవింద్ బీసీలంటూనే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెల్మల స్వరూప, కాముని వనిత, కల్లూరి చందన, కత్తెర దేవదాసు, రాగుల జగన్, కోడం అమర్, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన హర్షద్ రిజ్వాన్ అనే విద్యార్థి పాఠశాలకు వెళ్తుండగా ఆటో బోల్తాపడి గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను ఫోన్‌లో కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు బాబు, పందిర్ల లింగంగౌడ్, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, ఎడ్ల సందీప్, రవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● మద్యం తాగి వాహనాలు నడపొద్దు

సిరిసిల్ల క్రైం: జిల్లాకేంద్రంలో విస్తృతంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్సై దిలీప్ తెలిపారు. వాహనదారులు మద్యంతాగి వాహనాలు నడపవద్దని, మద్యంతాగి వాహనాలు నడిపితే కౌన్సెలింగ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్నట్లు తెలిపారు. రెండుసార్లు గురించి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు.

● టీబీ, ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన

సిరిసిల్ల అర్బన్ : ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం వందరోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా చిన్న బోనాలలో గురువారం తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. క్షయవ్యాధి బారినపడిన వారు, 60 ఏళ్లు దాటిన వృద్ధులు, పొగ తాగేవారు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీవో డాక్టర్ అనిత, అఫిజా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జైత్యా, ఎంఎల్‌హెచ్ ఆరీఫ్, ఏఎన్‌ఎం గంగాదేవి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● 'స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అర్హత లేని వ్యక్తితో బస్సు నడిపిస్తోందని, దీనిపై ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం, అజాగ్రత్తగా బస్సు నడిపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఎంఈవో కృష్ణహరి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్కూల్‌ను తనిఖీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంఈవో తెలిపారు. ఈ విషయంపై ఎంవీఐకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

● వెంకటాపూర్‌లో చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో మరాటి లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం.. గ్రామానికి చెందిన మరాటి లక్ష్మి భర్త ఎల్లయ్య నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. ఒంటరిగా ఉంటున్న లక్ష్మి గతనెల 30న ఇంటికి తాళం వేసి తన అమ్మగారి ఇంటికి రగుడుకు వెళ్లింది. తిరిగి వెంకటాపూర్‌కు బుధవారం రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించింది. బీరువాలోని చెవి కమ్మలు, రూ. 5వేల నగదు ఎత్తుకెళ్లారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు.

● నివాళి

వేములవాడ: జాతీయ గీత రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా న్యూఅర్బన్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి, రచయిత అన్నారు. ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, సుజాత, అంగన్‌వాడీ టీచర్ మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

● రెండు కార్లు ఢీ..

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ శివారులో బుధవారం అర్ధరెండు కార్లు ఢీకొన్నాయి. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సిరిసిల్ల పట్టణానికి చెందిన పత్తిపాక శ్రీనివాస్ పనినిమిత్తం ముస్తాబాద్ వెళ్లి తిరిగొస్తుండగా అదే సమయంలో కామారెడ్డికి చెందిన పొన్నాల సంతోష్ స్వగ్రామానికి వెళ్తూ అతివేగంగా, ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. శ్రీనివాస్‌కు చెందిన కారు పూర్తిగా ధ్వంసం కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

● హైవోల్టేజీతో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం

వీర్నపల్లి: మండలకేంద్రంలో గురువారం హైవోల్టేజీతో పలు ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. టీవీలు, పాఠశాలల్లో పలు కంప్యూటర్లు, ఫ్యాన్లతో పాటు పలు ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే మరమ్మతులు చేయించారు.

● ఒకరి రిమాండ్

వేములవాడరూరల్: మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్య తెలిపారు. వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన సంతోష్ ఓ మహిళ పట్ల ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడుతూ వేధించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'న్యాక్‌లో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న న్యాక్ ప్రతినిధులు

సిరిసిల్ల: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్) ద్వారా మహిళల ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నామని డాక్టర్ బీఆర్ రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఆర్ రావు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సిరిసిల్ల, నూకపల్లి(జగిత్యాల), కరీంనగర్, హుజురాబాద్‌లలో కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఒక్కో కేంద్రంలో 60 మందికి శిక్షణ ఇస్తామని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేశ్ తెలిపారు. 89787 08559లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. డీ.వై.యూన్సీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు




తీజ్ ఉత్సవాల్లో మాజీ జెడ్పీటీసీ, గిరిజనులు

చందుర్తి: మండలంలోని దేవునితండాలో తీజ్ ఉత్సవాలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులపాటు పూజలు చేసిన మొలకల బుట్టలను పందిరి వద్ద నుంచి గిరిజనుల యువతులు నెత్తిన ఎత్తుకుని ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అజ్మీర గణేశ్, సునావతు బిక్య, బుక్యా గోపాల్, అజ్మీర రాజు, మోహన్, గినాయా, జగమల్, బుచ్చిరెడ్డి, కిషన్, ఆగన్, సక్కు సునీల్, యువతులు తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లపై చర్చ

వేములవాడ: ఢిల్లీలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల శ్రీధర్‌బాబుతోపాటు ప్రముఖులతో జరిగిన ముఖ్య సమావేశంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ గురువారం పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించారు.

ప్లంబర్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలి



సిరిసిల్ల అర్బన్ : జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నుంచి ప్లంబర్స్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో జిల్లా ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కేకే మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, ప్లంబర్స్ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర సంరక్షణ సంఘం సహాయ కార్యదర్శిగా రాజ్‌కుమార్‌ను నియమించినట్లు వారు తెలిపారు. ఇక్కడ జిల్లా ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు తదితరులున్నారు.

'వర్కర్ టు ఓనర్' పథకాన్ని అమలుచేయాలి



నేతన్న చౌక్ వద్ద ప్లకార్డులతో కార్మిక నాయకుల ప్రదర్శన

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రోత్పత్తి కార్ఖానాల్లో శ్రమించే నేత కార్మికులు, యజమానులను చేసే 'వర్కర్ టూ ఓనర్' పథకాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని, వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని కోరుతూ కార్మిక సంఘం నాయకులు గురువారం ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. నేతన్న విగ్రహం వద్ద జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడారు. నేత కార్మికులకు శాశ్వత ఉపాధిని అందించే వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే అమలుచేయాలన్నారు. పట్టణ శివారులోని పెద్దూరు వద్ద నిర్మించిన వర్క్‌షెడ్లను పవర్‌లూమ్ కార్మికులకు కేటాయించి వర్కర్లను ఓనర్లను చేయాలన్నారు. నేతన్నల త్రిఫ్ట్ ఫండ్ (పొదుపు) పొదుపు పథకానికి సంబంధించిన డబ్బులు వెంటనే కార్మికుల ఖాతాల్లో జమచేయాలని రమేశ్ కోరారు. పట్టణంలో యువకులకు పవర్‌లూమ్స్, ఆధునిక లూమ్స్‌పై శిక్షణ ఇవ్వాలని, కార్మికులకు మెరుగైన ఉపాధి లభించే విధంగా ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇంకా అందించాలని రమేశ్ కోరారు. నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ , వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, సూరం పద్మ, దాసరి రూప, జిందం కమలాకర్, బెజుగం సురేశ్, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్, బింగి సంపత్, కారంపురి మహేశ్, దోమల రాము, సందుపట్ల పోచమల్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



సిరిసిల్ల అర్బన్ : పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు



ముస్తాబాద్: ఆవునూర్ జెడ్పీ పాఠశాలలో..



ఇల్లంతకుంట : కేజీబీవీ పాఠశాలలో ..



వీర్నపల్లి: ఆదర్శ పాఠశాలలో..

సిరిసిల్లఅర్బన్/ వేములవాడ/ ముస్తాబాద్/ రుద్రంగి/చందుర్తి/బోయినపల్లి/ఇల్లంతకుంట/ వీర్నపల్లి: పట్టణ పరిధిలోని పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. మహిళా ఉపాధ్యాయురాళ్లు తోటి ఉపాధ్యాయులకు రాఖీ కట్టి సోదరభావం చాటుకున్నారు. వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ముస్తాబాద్ మండలం ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, రుద్రంగి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, బోయినపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తపస్ ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. మల్లాపూర్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో తపస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ పాల్గొన్నారు. చందుర్తి మండలం మల్యాల, చందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను వివేకానంద సేవా సమితి, బీజేపీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇల్లంతకుంట మండలంలోని కేజీబీవీతోపాటు గాలిపెల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. వీర్నపల్లి మండలకేంద్రంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.

విజయవంతం చేయాలి



తంగళ్లపల్లి: మాట్లాడుతున్న ఆడెపు రవీందర్

తంగళ్లపల్లి: మండలంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, తంగళ్లపల్లి బీజేపీ ఇన్‌చార్జి ఆడెపు రవీందర్ అన్నారు. గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. మండల ప్రధాన కార్యదర్శులు ఇటికల రాజు, కోస్ని వినయ్ యాదవ్, ఉపాధ్యక్షులు రెడ్డిమల్ల ఆశీర్వాద్, ఇటుకల మహేందర్, కాశిచరణ్, నందగిరి నవీన్, సిలివేరి ప్రశాంత్, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రజల్లో దేశభక్తిని నింపేలా బీజేపీ చేపట్టిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్, హర్‌ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ మల్లారపు సంతోష్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో బీజేపీ కార్యశాల నిర్వహించారు. జిల్లా కౌన్సిలర్ మెరుగు అంజాగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి, మండల ఉపాధ్యక్షుడు గుండవేని తిరుపతి, కోశాధికారి మల్లేశ్, నందం, దీటి సత్తయ్య, జనార్ధన్, మీస శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: బీజేపీ చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ కోరారు. పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నాయకులు నర్సింలు, ఎలెందర్, విగ్నేష్‌గౌడ్, స్వామి, దేవరాజు, నాగరాజుగౌడ్, డాక్టర్ సత్యనారాయణ, ఆంజనేయులు, సత్యనారాయణ, దేవేంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: హర్ ఘర్ తిరంగా ద్వారా ప్రజలలో జాతీయ భావం పెంపొందించేలా తిరంగా ర్యాలీ నిర్వహించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, గంట బాలకృష్ణాగౌడ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న వైద్యాధికారి గీతాంజలి

ముస్తాబాద్: చిన్నారుల్లో నులి పురుగులను నిర్మూలించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గీతాంజలి కోరారు. ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణ, అల్బెండజోల్ మాత్రల పంపిణీపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 11న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు అందించాలన్నారు. సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీలు శుభ్రం

గంభీరావుపేట/రుద్రంగి : మండలంలోని లింగన్నపేట డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీలో డ్రైనేజీలను పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. పారిశుధ్య కార్మికులతో మురుగు కాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టారు.

సాక్షి స్పందన

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జిల్లెల రమేశ్ అన్నారు. మండలంలోని లింగంపేటలో గురువారం రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతే 1931కు, 100 డయల్ నంబర్లకు తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. గంజాయి వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. గంజాయి తాగేవారిపై, విక్రయదారులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

ముస్తాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే పెండింగ్ డీఏలు చెల్లిస్తూ పీఆర్‌సీని అమలు చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం మండలంలో టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదును నిర్వహించారు. పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు కొత్త పీఆర్సీపై ప్రకటన చేయలేదన్నారు. రిటైర్డు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, మండల గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్‌శర్మ, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.